మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## ఉచిత మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన..

### 300ల మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త :** 9వ వార్డు ప్రజలకు ఆదివారం గీత ఆసుపత్రి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డా.గీత ప్రముఖ శస్త్రచికిత్స నిపుణలు డా. విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఎంబిహెచ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో 9వ వార్డు ప్రజలకు ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 4 గం.ల వరకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 300ల మందికి ఉచితంగా షుగర్, బిపి పరీక్షతో పాటు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. గీత విశ్వనాథ్ మాట్లాడుతూ వర్షాకాలంలో పరిశుద్ధమైన గోరువెచ్చని నీటిని త్రాగాలని తమ ఇంటి పరిసర ప్రాంతాలలో వర్షంనీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆస్తమా వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని నెలనెల తప్పకుండా సంబంధిత వైద్యులను సంప్రదించి చెకప్ చేసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ తన వార్డులో పేదలకు ఉచిత మెగా వైద్య శబిరం నిర్వహించడం అభినందనీయమని డా.గీత విశ్వనాథ్ దపంతులతోపాటు వైద్య బృందానికి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘర్షణ సమితి అధ్యక్షురాలు పి. ఈశ్వరమ్మ,వైద్యులు నర్మద, శాంత సునిల్, భరత్, స్నేహ, అమృత పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న దృశ్యం

## క్యాడర్ ఉంది.. లీడర్ లేదు..

- కన్ఫ్యూజన్‌లో పెద్దమందడి కాంగ్రెస్ శ్రేణులు
- హైదరాబాద్‌కే పరిమితమైన మొగిలి సత్యారెడ్డి

**పెద్దమందడి, జూన్25, ప్రభాతవార్త:** పెద్దమందడి మండలంలో కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ సరైన లీడర్ లేకపోవడంతో కార్యకర్తలలో అయోమయం నెలకొంది. వచ్చే ఎన్నికల్లో నేతలు బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ పార్టీ బలోపేతంపై అధిష్టానం దృష్టి సారించకపోవడంతో కార్యకర్తలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతుంది. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా చిన్నారెడ్డి ఓటమి పాలైనప్పటి నుండి ప్రజా సమస్యలపై చెప్పుకోదగ్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ పని చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. పెద్దమందడి మండలానికి అంతా తానేనంటూ అధిష్టానం దగ్గర పదవి కొట్టేసినా జిల్లా డీసీసీ కార్యదర్శి మొగిలి సత్యారెడ్డి కనీసం చుట్టపు చూపుగానైనా మండలానికి రాకపోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఎదుర్కొని పార్టీని గ్రామాల్లో నిలబెడుతున్న కార్యకర్తలకు మండల నాయకుడంటూ ఒకరు లేకపోవడంతో కన్ఫ్యూజన్‌లో కార్యకర్తలు ఉండిపోయారు. గ్రామంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ మండల స్థాయి నాయకుడు సరిగా లేకపోవడంతో ఒక్కడుగు మందుకు నాలుగడుగులు వెనక్కి అన్నట్లుగా మండలంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నెలకొంది. జగత్‌పల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ పెంటయ్య యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఎన్నిక చేసి నెలలు గడుస్తున్నప్పటికీ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ అనుబంధు కమిటీలను ఏర్పాటు చేయకపోవడంతో కార్యకర్తలను నిరాశ నిస్పృహలు వెంటాడుతున్నాయి. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ సరైన లీడర్ కోసం మండల కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. తాను ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నానంటూ ఊదరగొడుతున్న మోజర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నెలకో 15 రోజులకో ఒకసారి వచ్చి ఐదారుగురు కార్యకర్తలతో కూర్చొని హల్‌చల్ చేసి వెళ్లడం పట్ల మిగతా కార్యకర్తలలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేవలం వ్యక్తిగత ప్రచారం తప్పా ప్రజా సమస్యలపై మోజర్ల నాయకుడు పోరాటం చేయడం లేదని విమర్శలు భాహటంగా వినిపిస్తున్నాయి. కొన్ని దేవాలయాలకు తమ గుడులకు చందాలు రాసిన మోజర్ల నాయకుడు ఆయా గ్రామాల ప్రజలు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదని ప్రజలు భాహటంగా విమర్శిస్తున్నారు. ఇలాంటి నాయకుడికి టికెట్ ఎవరు ఇస్తారు.? అసలు ఎమ్మెల్యేటికెట్‌కు ఆస్థాయికి సదరు వ్యక్తి అర్హుడైనా ప్రశ్నా కార్యకర్తలలో వ్యక్తమవుతుంది. టికెట్ ఆశించడం తప్పా ప్రతి కార్యకర్తను కాపాడుకోవడంలో మోజర్ల నాయకుడు విఫలమైనట్లు భాహాటంగా కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు విమర్శిస్తున్నారు. హైదరాబాద్‌కే పరిమితమైన డీసీసీకార్యదర్శి మొగిలి సత్యారెడ్డి, వివరణ కోసం ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం విశేషం.

## నియోజకవర్గ అభివృద్ధికి రూ.50కోట్ల 40లక్షల నిధుల మంజూరు...

- నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు....

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు రూ.50 కోట్ల 40 లక్షల నిధులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.30కోట్లు, అన్ని మండల కేంద్రాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.5కోట్లు, నాగర్‌కర్నూట్ పట్టణంలో ఈద్గా, షాదిఖాన్ నిర్మాణం కోసం రూ.3కోట్ల 50 లక్షలు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.10కోట్లు, మమ్మాయిపల్లి నుంచి వడ్డెర కాలనీ వరకు కొత్తగా బీటీ రోడు నిర్మాణానికి రూ.1 కోటి 90 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరడంతో కోరిన వెంటనే స్పందించి జీవో నెంబరు 244 విడుదల చేస్తూ నిధుల మంజూరికి ఉత్తర్వులను జారీ చేశారని ఆయన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ధరణి ఎత్తేస్తాం..!



- కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆగమైంది..
- కేవలం వాళ్ల కుటుంబమే బాగుపడ్డది..
- పోర్టల్ పేరుతో భూములు దోచుకుంటున్నారు..
- కుంభకోణాలు చేసిన వారిని జైలుకు పంపిస్తాం..
- బీఆర్ఎస్..భ్రష్టాచార రాక్షసుల సమితి
- మోడీ పాలనలో దేశంలో అభివృద్ధి..
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 5వ స్థానానికి భారతదేశం..
- నాగర్‌కర్నూల్ నవ సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25, ప్రభాతవార్త :** కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆగమైందని, దోపిడీకి గురైందని, ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములు దోచుకుంటున్నా రని, తాము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను, బీఆర్ఎస్‌ను ఎత్తేస్తామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఎన్నో ఆశలతో తెలంగాణ ఏర్పాటు చేసుకున్నామని, ఎందరో త్యాగాలు చేస్తే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డదని కానీ సాధించిన తెలంగాణలో ఒక్క కేసీఆర్ కుటుంబమే బాగుపడ్డదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన నవ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోడీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని, తెలంగాణ వికాసానికి మోడీ ఎంతో కృషి చేశారన్నారు. మోడీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు, రైతులు, యువకులు, పేదల బతుకుల్లో వెలుగు నింపడానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. మోడీ నేతృత్వంలో సుపరిపాలన, తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నదన్నారు. ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజనా కింద దేశంలో 80కోట్ల మందికి 5కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. యూరప్ దేశం జనాభా కంటే ఇది ఎక్కువ మందికి పంపిణీ చేస్తున్నట్లని పేర్కొన్నారు. మోడీ పాలన రాకముందు పేదరికం 22శాతం ఉంటే తొమ్మిదేండ్లలో 10శాతం తగ్గించారని చెప్పారు. అత్యంత పేదరికం ఉన్నవారు కేవలం ఒక్కశాతం మాత్రమే ఉన్నారన్నారు. పేదలపై అంకిత భావంతో వారి అభ్యున్నతికి పాటుపడుతూ దేశంలో 4కోట్ల మందికి పక్కా ఇల్లు నిర్మించడం జరిగిందని, తెలంగాణకు కేంద్రం 2లక్షల 50వేలు ఇండ్లు కేటాయిస్తే కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో అవినీతికి పాల్పడుతుందన్నారు. పేదరికం నియంత్రణకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణలో కమలం వికసిస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయని చెప్పారు. మహిళల ఆత్మగౌరవ నిలయాలు మరుగుదొడ్ల నిర్మాణాలు దేశంలో 11కోట్ల మందికి నిర్మిస్తే, తెలంగాణలో 21లక్షల కుటుంబాలకు మరుగుదొడ్డి వసతి కల్పించామని, వందశాతం ఓడీఎఫ్ ప్రకటించామన్నారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల కింద 9కోట్ల సిలిండర్లు అందజేశామన్నారు. ఆయుష్మాన్ భారత్ 50కోట్ల మందికి 5లక్షల ఉచిత ఆరోగ్య చికిత్స అందిస్తున్నామన్నారు. రెండేండ్లలో కరోనా తర్వాత, ఉక్రేయిన్ - రష్యా యుద్ధం గడ్డుకాలం తర్వాత కూడా భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన ఘనత మోడీది అన్నారు. గతంలో ప్రపంచంలో ఆర్థికంగా 10వస్థానంలో ఉన్న భారతదేశం నేడు 5వ స్థానాని వచ్చిందంటే దాని వెనకాల మోడీ కృషి ఎంతోఉందన్నారు. మెడీ పాలనకు ముందు 92శాతం దేశంలో మొబైల్స్ దిగుమతి చేసుకునే వారని, నేడు 97శాతం మొబైల్ ఫోన్లు భారతదేశంలో ఉత్పత్తి అవుతున్నాయన్నారు. దేశంలో ఎలక్ట్రికల్ వస్తువుల ఉత్పత్తి 500శాతం పెరిగిందన్నారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీ 3వ స్థానంలో ఉందని, బొగ్గు ఎగుమతిలో ముందంజ ఉందని, విదేశాలకు వెళ్తే మోడీని మా హీరో, రీఫార్మర్ అంటూ కొనియాడుతుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం మోదీని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కులం పేరుతో దూషిస్తూ, చాయ్‌వాలా అంటూ విమర్శిస్తున్నారని చెప్పారు. శివుడు విషాన్ని మింగినట్లు విమర్శలు మింగుతూ రాజీ పడకుండా దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న గొప్ప నాయకుడు మోడీ అని కొనియాడారు. కొన్ని దశాబ్దాల తర్వాత దేశ ప్రధాని స్థానంలో - మిగతా4లో..



సభలో పాల్గొన్న కార్యకర్తలు

## కేసీఆర్ ముందుచూపుతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం..

- బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను కాపీ కొడుతున్న బీజేపీ ప్రభుత్వం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మంత్రి సమక్షంలో 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ చేరిక

**వనపర్తి ప్రతినిధి, జూన్25, ప్రభాతవార్త:** దేశంలోనే మిగతా రాష్ట్రాల కంటే అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందంటే అందుకు కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపే కారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లోని పాతపల్లి, పెబ్బేరు, శ్రీరంగాపురం, అయ్యవారిపల్లి, రంగాపురం, సూగూరు, తిప్పాయపల్లి, గుమ్మడం , వెంకటాపురం , బూడిదపాడు, చెలిమిల్ల గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపీ కొడుతుందని మంత్రి తెలిపారు. 60 ఏళ్లల్లో తెలంగాణ రాష్ట్రం ఎంతో నష్టపోయిందని , సాగు, తాగునీరు , విద్య, వైద్యం, ఉపాధి విద్యుత్ రంగాలలో సమైఖ్య పాలకులు తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, రెండు తరాలు పూర్తిగా నష్టపోగా కేసీఆర్ నాయకత్వంలో మూడోతరం చేసిన పోరాటంలో తెలంగాణరాష్ట్రం సిద్ధించిందని మంత్రి తెలిపారు. 60 ఏళ్లలో తెలంగాణ ప్రజలు కోల్పోయినవన్నీ కేసీఆర్ పట్టుదల, ముందుచూపుతో 9 ఏండ్లలోనే సాధించుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎద్దుల సాయినాథ్, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ , బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన శ్రీరంగాపురం, పెబ్బేరు కార్యకర్తలు

## పాలమూరు జిల్లాపై..

# కరుణించిన వరుణుడు..!



దేవరకద్ర మండలం నాగారం వద్ద గుంటుక కొడుతున్న రైతు

- జిల్లాకు తాకిన రుతుపవనాలు
- ఎండుతున్న మొక్కలకు ప్రాణంపోసిన వర్షం
- అదృష్టపరిక్షకు రైతుల సన్నాహాలు
- ఆనందంలో అన్నదాతలు
- అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో, అతితక్కువగా మిడ్జిల్‌లో వర్షపాతం నమోదు



వర్షం రాకతో కళకళలాడుతున్న పత్తి మొక్క

**దేవరకద్ర, జూన్ 25 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లాపై ఎట్టకేలకు వరుణుడు కరుణజూపాడు...వర్షం కోసం కళ్ళలో వత్తులు పెట్టుకొని ఎదురుచూసిన రైతాంగానికి ఉపశమనం లభించింది. పాలమూరు జిల్లాలో శనివారం రాత్రి వర్షం కురిసింది. ఆదివారం కూడ వర్షం కురిసింది. దీంతో జిల్లాకు రుతుపవనాలు తాకినట్లైంది. వర్షం రాకతో అన్నదాతల్లో కొత్త ఆశలు చిగురించాయి. వర్షం కురవడంతో ఎండుతున్న మొక్కలకు ప్రాణంపోసనట్లైంది. జిల్లాలో అత్యధికంగా మహబూబ్‌నగర్ అర్బన్‌లో 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నయోదైంది. అతితక్కువగా మిడ్జిల్‌లో 3.1 మిల్లీమీటర్ల వర్షపాతం నయోదైంది. అలాగే చిన్నచింతకుంటలో 6.5, కోయిలకొండలో 4.0, గండీడ్‌లో 4.8, హన్వాడలో 19.2, దేవరకద్రలో 13.0, అడ్డాకులలో 6.6, మూసాపేటలో 9.5, బాలానగర్‌లో 13.6, రాజాపూర్‌లో 14.2, జడ్చర్లలో 5.5, మహ్మదాబాద్‌లో 8.4, కౌకుంట్లలో 28.1 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. వర్షం రాకతో జిల్లాలో రైతులు వర్షాకాలం అదృష్టపరిక్షకు మళ్లీ సన్నాహాలు ప్రారంభించారు. వర్షం కురిసి భూమి పదునెక్కడంతో చాలా ప్రాంతాలలో రైతులు విత్తనాలు విత్తేపనుల్లో నిమగ్నమయ్యారు. ఇదివరకే విత్తనాలు విత్తిన రైతులు పొలాల్లో మొలకెత్తిన కలుపు మొక్కలను తొలగించే పనులు చేపడుతున్నారు. వర్షం రాకతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్మానుష్యంగా కనిపించే పొలాలు రైతులతో కళకళలాడుతున్నాయి. పొలాల వద్ద ఎక్కడ చూసిన రైతులే కనిపిస్తున్నారు.

**ఆనందంలో.. అన్నదాతలు**

వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. వర్షాలు కురువకపోవడంతో అన్నదాతలు ఇన్ని రోజులు ఆందోళన చెందారు. కాని వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇన్ని రోజులు వర్షాకాలం ప్రారంభమైన వరుణుడు కరుణించడం లేదు. దీంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోయలేదు. వర్షాలు వస్తాయని కొంతమంది ఇదివరకే పొలాల్లో విత్తనాలను విత్తారు. కాని వర్షాల జాడే కనిపి ంచడం లేదు. దీంతో విత్తిన విత్తనాలు భూమిలోనే మొలకెత్తకుండా పోయాయి.

**ఆకాశంలో నల్లనిమేఘాలు..** చల్లనిగాలులతోనే కాలం వెళ్ళిపోయింది. కేవలం చినుకులతోనే వరుణుడు సరిపెట్టాడు. ఈ తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఈ వర్షాకాలంలో కురిసిన పెద్ద వర్షం ఇదే.

**ఈ ఏడాది 3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు వేస్తారని అంచనా..**

ఇది ఇలా ఉండగా పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2023-24 వర్షాకాలంలో 3,77,917 ఎకరాలలో అన్నిరకాల పంటలు సాగు చేస్తారని వ్యవయాధికారులు అంచనా వేశారు. ఇందులో దాదాపు 1,89,917 ఎకరాలలో వరి పంటను సాగు చేస్తారని అంచనా వేశారు. అలాగే పత్తి 1,15,845ఎకరాలు, మొక్కజొన్న 28,546 ఎకరాలు, జొన్న 13,015, కంది 12,548, ఆముదం 1,565, రాగులు 855, పెసర 195, మినుములు 65, ఉలవలు 81, వేరుశెనగ 69, చెరుకు 61, ఇతర పంటలు 405, కూరగాయల తోటలు 14,750ఎకరాల చొప్పున సాగు చేస్తారని అంచనా వేశారు. పంటలకు తగ్గట్లు రసాయనిక ఎరువుల ప్రణాళికను కూడ అధికారులు సిద్ధం చేశారు. వర్షాలు ఆలస్యమైతే..సాగు మరింత వెనక్కి అవుతుందని రైతుల్లో అందోళన ప్రారంభమైంది. జిల్లాలో వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా వానాకాలం పంటల, ఎరువుల ప్రణాళికలను సంబందిత అధికారులు ఖరారు చేశారు. జిల్లాలో నేలస్వభావాన్ని బట్టి ఏయే పంటలు ఏ మేరకు సాగవుతావోనని కూడ అంచనా వేశారు. అయితే ఈ వర్షాకాలం పంటలలో పత్తి, కంది, మొక్క జొన్న, జొన్న, చిరు ధాన్యాల సాగు విస్తీర్ణ్యం పెరుగనుందని అంచనా వేశారు. పంటల సాగు విస్తీర్ణ్యంతో పాటు అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల కూడ ప్రణాళికను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు.



## నేనున్నానంటూ ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే ఆల..

బాధిత కుటుంబానికి రైతుబంధు భీమా, పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులు అందజేత

సిద్దాయిపల్లి వద్ద డబుల్ బెడ్ రూం మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆల



కార్యకర్త కేశవులు భార్య భూదేవికి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త బాధిత కుటుంబానికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నేను న్నానంటూ భరో సానిచ్చి ధైర్యం చెప్పా రు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని సిద్దాయపల్లిలో బిఆర్ఎస్ కార్యకర్త ఉదగిరి కేశవులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అండగా ఉంటూ ప్రత్యేక చొరవతో బిఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా రూ. 2,00,000 అదేవిధంగా రైతుభీమా చెక్కు రూ.5,00,000 మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం బాధ్యత కుటుంబ సభ్యులను - మిగతా4లో..

## దేవాలయాల అభివృద్ధికి కృషి..!

నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

**కోయిల్‌కొండ, జూన్ 25 ప్రభాతవార్త :** తెలంగా రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలో గల శ్రీ ఆది ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం కొరకు భూమిపూజ, శంకుస్థాపన గావించారు. ముందుగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు డి.ఎంరాఘవేంద్రరావు బ్రాహ్మణోత్తములతో కలిసి దేవాలయాల సాంప్రదాయ పద్దతిలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా -మిగతా4లో..



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## కేసీఆర్‌కు రుణపడి ఉంటాం:దివ్యాంగ ఉపాధ్యాయ సంఘం

**వనపర్తి విద్యా విభాగం,జూన్25,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రం బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో దివ్యాంగ ఉద్యోగ సంఘం సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో హాజరైన దివ్యాంగ ఉద్యోగ సంఘం ప్రెసిడెంట్ నరేందర్ మాట్లాడుతూ... దివ్యాంగ ఉద్యోగుల కన్వీనియన్స్ అలవెన్సెస్ 2000 నుండి 3000కు పెంచుతూ జీవో 58 జారీ చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా కమిటీ నుండి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని ఆయన అన్నారు. ఇలాగే దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎల్లప్పుడు ఇలాంటి సానుకూల వైఖరి కలిగి ఉండాలని కోరుకుంటున్నామని మాకు ఏ సమస్యలు ఉన్న ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కోశాధికారి రామకృష్ణ యాదవ్, గౌరవ అధ్యక్షులు అమర్, ఉపాధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పురుషోత్తంరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**గద్వాల ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహరెడ్డి ధరూర్ మండలపార్టీ యూత్ అధ్యక్షుడు చిట్టెం పురుషోత్తంరెడ్డి జన్మదినం సందర్భంగా మిఠాయి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవి ష్యత్తులో ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆ భగవం తుని ఆశీస్సులతో నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లిన తలసాని జంగారెడ్డికి బీజేపీ నాయకుల ఘన సన్మానం

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:**1975లో అనాటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీలో జైలు పాలైన కల్వకుర్తి పట్టణానికి చెందిన తలసాని జంగారెడ్డిని కల్వకుర్తి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు మొగిలి దుర్గప్రసాద్, కృష్ణగౌడ్ మాట్లాడుతూ అనాటి ఎమర్జెన్సీని ప్రజాస్వామ్య బద్ధంగా కుట్రలు, కుతంత్రాలు నియంతృత్వ చీకటి రోజులు ఎదుర్కొని జైలుకు వెళ్లిన వారు చాలా ధైర్యవంతులని, వారి త్యాగాలను స్మరించుకునే రోజును ఆనాటి కాంగ్రెస్ విధానాలను చరిత్రను యువత తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ నర్సింహ్మా, బీజేపీ నాయకులు పాలకుర్ల రవిగౌడ్, హరికృష్ణ శర్మ, శ్రీకాంత్‌యాదవ్, సుమన్, నవీన్ ఉన్నారు.



## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**గద్వాల ప్రతినిధి,జూన్ 25 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయ లంలో జోగులాంబ గద్వాల జిల్లాలో ధరూర్ మండలానికి మహాత్మా జ్యోతిరావుపూలె బిసి బాలుర గురుకుల డిగ్రీ కళాశాల ధరూర్‌కు కేటాయించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ధరూర్ మండల ప్రజల ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, చక్రధర్‌రావు, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



## రక్తదానంతో ప్రాణదాతలు కండి..

**- మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్**

**వనపర్తి టౌన్,జూన్25,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు ఆపద సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, డాక్టర్ మురళీధర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన యువత రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన పోచ రవీందర్‌రెడ్డి అత్యధికంగా రక్తదానం చేయడంతో హర్షం వ్యక్తం చేస్తు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంకర్ గౌడ్, సత్తార్, సురేష్ రెడ్డి, గోనూరు యాదగిరి, గోకారం రాజు, రాజారామ్ ప్రకాష్,జిజె శ్రీనివాసులు, శ్రీనివాసరావు, సుఖేందర్‌రెడ్డి, కృపానందం గౌడ్, రమణ, తదితరులు ఉన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన బాలరాజు అనే వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి కాలు విరిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కల్వకుర్తి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... వంగూరు మండలం పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు కల్వకుర్తి పట్టణంలోని కళ్యాణ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఉదయం తాండ్రకు వెళ్లి వచ్చే క్రమంలో ఎదురుగా శ్రీశైలం వైపు అతివేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టడంతో బాలరాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి కాలు విరిగింది. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్,కౌన్సిలర్‌సూర్యప్రకాష్‌రావు,శ్రీకాంత్‌లు మృతదేహన్ని పరిశీలించి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసహయం అందించారు.మృతుడికి భార్య ఇద్దరుపిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



## పుట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీటీసీ

**అడ్డాకుల,జూన్25,ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గోవుల బాలరాజు, రాధ దంపతుల ఇద్దరి కూతుర్ల పుట్టు చీర కార్యక్రమంలో జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోద జయన్న గౌడ్, సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చైర్‌పర్సన్ పరామర్శ..

**ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి సహకారంతో ఆర్థిక సహాయం**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 25 ప్రభాతవార్త:**జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు చెన్నకేశవస్వామి దేవాలయం దగ్గర శనివారం రాత్రి గుండెపోటుతో కప్పల శ్రీనివాస్ మరణించారు. విషయం తెలిసిన వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి రవిందర్‌కు సమాచారం ఇవ్వగా ఆమె ఆదివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థివ దేహనికి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారం మేరకు అంత్యక్రియలకు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రంలో వార్డు బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి ముఖీద్, మున్సిపల్ కౌన్సిలర్లు చైతన్య, హరికృష్ణగౌడ్, కాటమోని దేవ, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పిట్టల మురళి, ఎఎంసి వైస్ చైర్మన్ దానిష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోరెపల్లి రవిందర్, ఆజార్, టైగర్ నరసింహ, కోనేటి నరసింహ, కొండల్, జగదీష్, చికురి శివ, సురేష్, ఈటె శ్రీను, గుండు శ్రీశైలం పాల్గొన్నారు.



# మన్యంకొండలో ఘనంగా తిరుచ్చిసేవ..!

**- అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి దర్శనం**

**దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్మరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్యంకొండలో స్వామివారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పూజారులు



స్వామి వారికి హారతి ఇస్తున్న అళహరి రామకృష్ణ

## బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై...

**-ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీల నాయకుల చేరికలు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా గడపగడపకు చేరడాన్ని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్కపల్లి మండలంలోని బొప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ గొల్ల బిచ్చెలు, సీనియర్ నాయకులు కొండల్‌రావు, సురేస్‌రావు, నాగల్‌రావులతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 76 సంవత్సరాల చరిత్రలో తెలంగాణలో ఎన్నడు అమలు కానీ సంక్షేమ పథకాలు అభివృద్ధి కేవలం 8 సంవత్సరాల్లోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా త్వరలో జరగనున్న రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించనుందని, ప్రధానిగా సీఎం కేసీఆర్‌ను ప్రజలు అకాంక్షి స్తున్నారన్నారు. దేశంలో 18 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా తెలంగాణ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. దేశంలో ప్రధాని మోడీ కులాలు, మతాల మధ్య విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని, ప్రజలు వారికి త్వరలోనే బుద్ధి చెప్పి తరిమివేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## మనోధైర్యాన్ని కోల్పోవద్దు మాకు అండగా నేనున్నా..

**అక్రమంగా అరెస్టయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లాచైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్**

**గద్వాల ప్రతినిధి,జూన్25 ప్రభాతవార్త:**నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులను గతవారం అర్థరాత్రి సమయంలో అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఈ సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు అక్రమంగా అరెస్టు అయిన వారి కుటుంబ సభ్యులను ఆదివారం ఇంటింటికి వెళ్లి పరామర్శించారు. మల్దకల్, ఉలిగేపల్లి గ్రామాలకు చెందిన నేతన్న బంగారు తిమ్మప్ప, భూపతి, దాసరిపల్లి గ్రామానికి చెందిన సర్వేష్, చిన్నరాముడు, రమేష్, కెటిదొడ్డి మండలం పాగుంట గ్రామానికి చెందిన సామియేల్, స్వామి ధరూర్ మండలం వామన్‌పల్లి గ్రామానికి చెందిన రంగస్వామి కుటుంబ సభ్యులను గొంగళ్ల రంజిత్‌కుమార్ పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి లవన్న,జిల్లా నాయకులు వెంకట్రాములు, పరశురాముడు, అవనిశ్రీ, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప,ఆంజనేయుల, కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి తిప్పన్న, మల్దకల్ మండల నాయకులు లక్ష్మన్న,గుండన్న,కృష్ణ,గోపాల్,కృష్ణ,కెటిదొడ్డి మండలనాయకులు భీమన్‌గౌడ్,దస్తగిరిగౌడ్,ఎల్లేష్,ఏసన్న పాల్గొన్నారు.



అరెస్టయిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్న రంజిత్‌కుమార్

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

**టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దేవునిగుట్ట ఉపసర్పంచ్ సహా 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 25 ప్రభాతవార్త :** క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అనిరుధ్‌రెడ్డి సమక్షంలో జడ్చర్ల మండలంలో దేవునిగుట్ట గ్రామ టిఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ తార్యా, 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏఒక్క వర్గం అభివృద్ధి చెందలేదని, నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు నానా అవస్థలు పడుతున్నారని, రైతుల రుణమాఫీ ఏమైందని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి సీఎం కెసిఆర్ మోసం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 500లకే గ్యాస్ కనెక్షన్, ఏకకాలంలో రూపాయలు రెండు లక్షల రుణమాఫీ, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



పార్టీలో చేరిన నాయకులతో అనిరుధ్‌రెడ్డి

## ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం:ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:**ప్రజల జీవనప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని 59 మంది లబ్ధిదారులకు రూ.31లక్షల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత లబ్ధిదారులకు అందించారు. అదే విధంగా 51 మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.26లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ మనిషి కాదు... మహాశక్తి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ అధికారి నిఖిల్ సాయియాదవ్‌కు ఘన సన్మానం

**వనపర్తి,జూన్25,ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు గాంధీనగర్ చంద్రకళ ఎల్ఐసి కృష్ణ యాదవ్ కుమారుడు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ అధికారి ఉద్యోగం సాధించిన నిచల్ సాయియాదవ్‌ను జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి , ఎల్ఐసి కృష్ణ మిత్రబృందం వేరు వేరుగా ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణరాష్ట్రం నుండి ఒకే ఒక్కడు మన జిల్లా, మన ఊరు నుండి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ ఉద్యోగం నిచల్ సాయియాదవ్ సాధించడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. నేటి యువత నిచల్ సాయియాదవ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత సదుర్ల రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, 19వ వార్డు బీఆర్ఎస్ యువ నాయకులు పోతులపల్లి బాలరాజు, తెలంగాణ రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్స్, వైస్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్, వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యుగంధర్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీఆర్ఎస్ నాయకులు మంద రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నిఖిల్ సాయియాదవ్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



నిఖిల్ సాయియాదవ్‌ను సన్మానిస్తున్న ఎల్ఐసి మిత్రబృందం

## దేవరకద్రలో ఘనంగా మైసమ్మ ఉత్సవాలు..

**దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త:**దేవరకద్రలోని హరిజనవాడలో ఆదివారం మైసమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్ళి నైవేధ్యాలు సమర్పించారు. తప్పెట్లు,తాళాల మద్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది.ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా అమ్మవారి గుడిని రంగురంగుల విద్యుత్‌బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.గుడి ముందు పచ్చని పందిరి వేసి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## కల్వ కన్నయ్యశెట్టికి సన్మానం..

**దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త:**మహబూబ్‌నగర్‌లో ఆదివారం దేవరకద్ర ఆర్యవైశ్య నాయకుడు, స్థానిక శ్రీ వాసవి మాత దేవస్థానం చైర్మెన్ కల్వకన్నయ్యశెట్టిని ఘనంగా సన్మానించారు.మహబూబ్‌నగర్ పాలమూరు బ్యాంకు సిల్వర్‌జూబ్లి సందర్భంగా బ్యాంకు యాజమాన్యం కల్వకన్నయ్యశెట్టికి ఈ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు యాజమాన్యం,తదితరులు పాల్గొన్నారు.




## మైసమ్మకు బీఆర్ఎస్ నాయకుల పూజలు..

**దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త:**దేవరకద్రలోని హరిజనవాడలో కొలువుదీరిన గ్రామదేవత మైసమ్మ అమ్మవారికి ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఉత్సవాల సందర్భంగా వారు ఈ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ విజయ వెంకటేశ్,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్,నాయకులు దొబ్బలి అంజనేయులు,ఉమ్మిగారి వెంకటేశ్,బీసు శ్రీనివాస్‌రెడ్డి,బైద్ల రాములు,మాజీ యంపీటీసీ జగన్,బైద్లరాములు, మధు,కొండ భాస్కర్‌రెడ్డి,యూత్ నాయకుడు హన్మిరెడ్డి పాల్గొన్నారు.



## దశదిన కర్మలో పాల్గొన్న జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి

**అడ్డాకుల,జూన్25,ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా పాలకొండ దగ్గర అనంత మారుతి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన మోడల ఆంజనేయులు మాతృమూర్తి కీ.శే.మోడల కిష్టమ్మ దశదినకర్మలో పాలొని ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆత్మకు శాంతి కలగాలని జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దూరి చంద్రమోహన్‌రెడ్డి,మూసాపేట్ జడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, కందూరుసర్పంచ్ శ్రీకాంత్,వెంకటేష్,సత్యంసాగర్ పాల్గొన్నారు.



## రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోండి

**- సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి**

**వీపనగండ్ల,జూన్25,ప్రభాతవార్త:** వీపనగండ్ల గ్రామ సర్పంచ్ వంగూరు నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఎవరైనా రైతులు కొత్తగా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు ఉంటే రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని వారన్నారు. దరఖాస్తు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు , బ్యాంక్ అకౌంట్ , రైతుబంధు దరఖాస్తు ఫారం తీసుకుని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని రెండు , మూడు రోజుల్లో వినియోగించుకోవాలని వారు రైతులకు తెలిపారు.



## సీఎం సహాయనిధి అందజేసిన ఎమ్మెల్యే

**గద్వాల ప్రతినిధి,జూన్ 25 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని తుమ్మపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు కర్రెప్ప తండ్రి పెద్ద గిడ్డయ్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి కింద రూ. 18వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## పీయూ వీసీ నిజాయితీని శంకించడం తగదు..

**- పీయూ ఒప్పంద అధ్యాపకుల ఐకాస**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్25, ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ నిజాయితీని శంకించడం తగదని, ఆయనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని పీయూ ఒప్పంద అధ్యాపకుల ఐకాసం పేర్కొన్నది. పాలమూరు విద్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వీసీ అనునిత్యం నాన్ టీచింగ్ ఉద్యోగులు, ఒప్పంద అధ్యాపకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.



తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతూ జీవో నెంటర్ 141ను అలు చేసి వేతనాలను భారీగా పెంచారని, నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుకై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో అనుమతి పొంది ఆర్థికశాఖ ఆమోదం కోసం ఫైల్ పంపించడం జరిగిందన్నారు. జీతాలు పెరిగే సమయంలో అవాస్తవాలు ప్రచారం చేయడం వల్ల నాన్ టీచింగ్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పంద అధ్యాపకులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఉద్యోగ భద్రత, ఆర్డర్ కాపీలు కోసం కృషి చేస్తున్న వీసీపై ఆరోపణలు చేయడం సరికాదని చెప్పారు. కార్యక్రమంలో ఐకాస చైర్మన్ డా.భూమయ్య, కన్వీనర్ రవికుమార్, జనరల్ సెక్రటరీ సుదర్శన్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు గౌస్, సురేష్, సురేందర్, రామ్మోహన్, మధు పాల్గొన్నారు.

## వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సేవలు..

**కల్వకుర్తి, జూన్ 25 ప్రభాతవార్త:** వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశానుసారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయ సేవలలో భాగంగా ఆదివారం సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి రెండు సిమెంట్ బెంచీలు, రైతుబంధులో భాగంగా రైతుకు విత్తనాలు, క్రిమి సంహారక మందులు, ఒక సైనికుడికి సన్మానం, ఒక బీద వైశ్యునికి నిత్యావసర సరుకులు, ఒక సైనికుడికి సన్మానం, పది మంది పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి వాసవీయన్ గోల్డెన్ స్టార్ కేసీజీఎఫ్ వంక మామిడి రాజేందర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ రాజల్ బండి శ్రీనాథ్, రీజియన్ చైర్మన్ ఈరువెంటి రమేష్‌లు హాజరై పథకాలను అందించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ వనితా గోల్డ్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమని, ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలన్నారు. కార్యక్రమంలో రీజియన్ సెక్రటరి జూలూరి సత్యనారాయణ, జోన్ చైర్మన్ పోల విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ శివ జగదీశ్వర్, కలిమిచెర్ల గోపాల్, గుగ్గిల శంకర్, దాచేపల్లి మనోహర్, కల్వకుర్తి వాసవీక్లబ్ కేసీజీఎఫ్ ప్రెసిడెంట్ చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వలక్ష్మి, కోశాధికారి దుగ్గి ధనలక్ష్మి, వాసవీక్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మర్రి చిత్రపటాలకు పాలాభిషేకం...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:** ముస్లిం మైనార్టీల అభివృద్ధికి రూ.3 కోట్ల 50లక్షల నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చిత్రపటాలకు నాగంకర్నూల్ చౌరస్తాలో కౌన్సిలర్ ఇషాక్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇషాక్ మాట్లాడుతూ హజ్ హౌస్, షాది ఖానా నిర్మాణాలు చేపట్టే బాధ్యత పూర్తిగా ఎమ్మెల్యే తీసుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పెద్ద కాంట్రాక్టర్లను రప్పించి ఈ పనులు పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇవ్వడాన్ని చూస్తుంటే ముస్లిం మైనార్టీలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అదే విధంగా కబ్రస్తాన్ కోసం మరో 5 ఎకరాల స్థలాన్ని సమీకరించి అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీల కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు మైనార్టీ సోదరులు అండగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సోదరులు నసీర్, తదితరులు ఉన్నారు.



## మృతి చెందిన గీత కార్మికుడికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**వెల్దండ, జూన్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని యాదయ్య గత వారం రోజుల క్రితం తాటి చెట్టుపై నుంచి క్రింద పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మృతుడి భార్య యాదమ్మకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్‌గౌడ్, రవి, శేఖర్, గణేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, మల్లేష్; శేఖర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## దళితుల జీవితాలలో వెలుగు నింపేందుకే దళితబంధు

**- బీఆర్ఎస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి , వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంధం పరంజ్యోతి**

**వనపర్తి టౌన్, జూన్25, ప్రభాతవార్త:** దళితబంధు పథకం దళితుల జీవితాలలో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ రెండో విడత రాష్ట్రంలో 1,29,800 దళిత కుటుంబాలకు, 118 నియోజకవర్గాల్లో 1100 చొప్పున ఒక్కో లబ్ధిదారునికి 10లక్షలు రూపాయలు కేటాయించి దళితులు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందుటకు కేటాయించడం జరిగిందని మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి హర్షం వ్యక్తం చేశారు. దళితుల కొరకు ఏ ముఖ్యమంత్రి ఇలాంటి అభివృద్ధి పథకాలు చేయలేదని, సీఎం కేసీఆర్ కే సాధ్యమని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**అలంపూర్, జూన్ 25 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలో ఉన్నవివిధ గ్రామాల వారికి 29 మంది లబ్దిదారులకు 9.45 లక్షల రూపాయల సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అయిజ మండలానికి చెందిన 11 చెక్కులను ఐదు లక్షల 89 వేల రూపాయలు అందజేశారు. ఇటిక్యాల మండలానికి చెందిన 7 చెక్కులకు గాను రూ.79,500లు, మానవపాడు మండలానికి చెందిన 1 చెక్కు 60 వేలు, రాజోలి మండలానికి 2 చెక్కులకు గాను 39,500లు, వడ్డేపల్లి మండలానికి మూడు చెక్కులకు గాను 42,000లు, అలంపూర్ మండలానికి 5 చెక్కులకుగాను 1,35,000 లక్షలు మొత్తం 29 చెక్కులకు 45లక్షలు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు ఒకగొప్ప వరమని అనేక మంది పేద ప్రజలు డబ్బులు లేక ఆసుపత్రుల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయనిధి కింద పేద ప్రజల ప్రాణాలను రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం..

**నవాబ్‌పేట, జూన్ 25 ప్రభాతవార్త :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెకు పదాం ఛలో ఛలో కార్యక్రమంలో భాగంగా సిరి చిన్నపిల్లల ఆసుపత్రి అధినేత, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డా. రాఘవేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నవాబ్‌పేట మండల కాకర్లపహాడ్‌లోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆసుపత్రి చైర్మన్ ఈర్లపల్లి అశోక్‌కుమార్, గ్రామ సర్పంచ్ పాశం జంగమ్మలతో కలిసి వైస్ ఎంపిపి సంతోష్‌రెడ్డి ఉచిత వైద్యశిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వైస్ ఎంపిపి సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం సిరి ఆసుపత్రి ఆధ్వర్యంలోవైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈసందర్భంగా సిరి చిన్నపిల్లల ఆసుపత్రికి చెందిన వైద్యులు వి. సాగర్, శరత్, గౌతమ్‌లు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకుగాను తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిరి చిన్నపిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది.



# రాజకీయాలు కాదు... అభివృద్ధే ముఖ్యం...

**- ముస్లిం సంక్షేమానికి ఎల్లప్పుడు అండగా ఉంటా...**

**- హజ్ హౌజ్, ఈద్గా, ఖబ్రస్థాన్ నిర్మాణానికి పూర్తి బాధ్యత నేనే తీసుకుంటా...**

**- పదవులు శాశ్వతం కాదు.. ప్రజలకు చేసిన సేవే ముఖ్యం**

**- ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్25 ప్రభాతవార్త:** రాజకీయాలు ముఖ్యం కాదని, అభివృద్ధే ముఖ్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ ముస్లిం సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి రూ.3కోట్ల 50లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్రి జనార్ధన్‌రెడ్డిని వివిధ ముస్లిం సంఘాల పెద్దలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు ముఖ్యం కాదని, ఈ ప్రాంతానికి ప్రతినిధిగా ఉండి ఏమి చేశారన్నదే ముఖ్యమన్నారు. నాగర్‌కర్నూల్‌లో నా హయంలో జరిగిన అభివృద్ధి ఏమిటో నా కళ్ల ముందే కనిపిస్తుందన్నారు నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పాటు నుంచి మెడికల్ కళాశాల, జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ సమీకృత కార్యాలయాలు, ట్యాంక్‌బండ్, బుద్దుడి విగ్రహం, ప్రతి వీధిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయన్నారు. దీనికి తోడు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఈ ప్రాంతానికి ఒక కలికితు రాయి అని చెప్పవచ్చునన్నారు. ఊయ్యాలవాడ నుంచి బస్ డిపో వరకు ప్రధాన రహదారిపై డివైడర్ నిర్మాణం ద్వారా ప్రయాణీకులకు సౌకర్యమే కాకుండా పట్టణానికి ఒక అందంగా నిలిచిందన్నారు. ఈ ప్రాంతానికి ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకొని రావడానికి కృషి చేస్తానని, మీ ఆశీర్వదంతో వాటిని కూడా సాధిస్తానన్నారు. హజ్ హౌస్, షాది ఖానా నిర్మాణాలు చేపట్టే బాధ్యత పూర్తిగా నాపై వదిలి పెట్టాలన్నారు. పెద్ద కాంట్రాక్టర్లను రప్పించి ఈ పనులు పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా కబ్రస్తాన్ కోసం మరో 5 ఎకరాల స్థలాన్ని సమీకరించి అందిస్తామని హామీ ఇచ్చారు. వక్ఫ్ కాంప్లెక్స్ స్థలంలో నిరుపేదల కోసం ఆటోనగర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ముస్లిం పెద్దల సహకారం అవసరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాజకీయాల్లో 40 ఏళ్లుగా అనేక మంది వచ్చారని వారు చేసిన అభివృద్ధి ఏమిటో, తొమ్మిదేళ్లలో నేను చేసిన అభివృద్ధి ఏమిటో మీ కళ్ల ముందు ఉన్నాయన్నారు. పలువురు ముస్లిం నాయకులు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా అన్ని పనులు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇస్తూ మరో రూ.50లక్షల అధిక నిధులతో అభివృద్ధి పనులకు అన్ని విధాల సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం అడ్వయిజరీ కమిటీ బాధ్యలు షేక్ యాకుబ్ బావజీర్, మొహమ్మద్ సాధిక్ పాషా, జిల్లా హజ్ సోసైటీ అధ్యక్షులు షేక్ ఫరీద్ అహ్మెద్, సభ్యులు శుకూర్, వక్ఫ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ కమిటీ కార్యదర్శి అబ్దుల్ ఖాన్, మదర్సా ఇస్లామియా ఫజల్ ఉల్ ఉలూమ్ కమిటీ కార్యదర్శి సయ్యద్ రఫియొద్దిన్, సభ్యులు అబ్దుల్ అలీమ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ముస్తాక్ అహ్మెద్, కౌన్సిలర్ ఇషాక్‌మియాలతో పాటు వివిధ మస్జిద్ కమిటీల బాధ్యులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## నేడు రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌కు ఎబివిపి పిలుపు..

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌కు పిలుపున్విడం జరిగిందని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ న్నిరు. విద్యా సంవత్సరం మొదలై నెల పూర్తి కావస్తున్నప్పటికి ఇంకా పూర్తి స్థాయిలో పాఠశాలలకు పుస్తకాలు, యూనిఫామ్స్ చేరలేదని అన్నారు. ప్రభుత్వానికి పదవుల పట్ల రాజకీయాల పట్ల తప్ప విద్యార్థుల పట్ల విద్యా వ్యవస్థ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి లేదనిఅన్నారు. గత సంవత్సరం కూడా పుస్తకాలు లేక విద్యార్థులుపాధ్యాయులు ఎన్నో అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికి కనీస వసతులు మెరుగుపరచలేదని మరమ్మతులు చేయలేదని అన్నారు. స్కావెంజర్స్ లేకపోవడంతో ఉన్న వసులు కూడా పూర్తి నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. మన ఊరు మనబడి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఇదిలాగే కొనసాగిస్తే ఎబివిపి ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని అన్నారు. అలగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్య తరగతి వారికి విద్యను దూరం చేస్తున్న ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ సురేష్, నగర కార్యదర్శి, ఉపాధ్యక్షుడు నిచల్, శరణ్, వినయ్, మహేష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా:ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు ఇటీవల ప్రమాదవశాత్తు వివిధ కారణాలతో మృతి చెందడంతో వారు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం కలిగి ఉన్న వారికి పార్టీ ప్రమాద భీమా తరుపున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అందించారు. నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్ద ముద్దునూరు గ్రామానికి చెందిన బాలపీర్ కుటుంబానికి రూ.2లక్షలు, శ్రీపురం గ్రామానికి చెందిన ఎం.చెన్నయ్య కుటుంబానికి రూ.2లక్షలు, తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన నర్సింహ్మాచారి కుటుంబానికి రూ.2లక్షలు, బిజినపల్లి మండలంలోని ఎర్రకుంట తాండ గ్రామానికి చెందిన మూడావత్ రాజు కుటుంబానికి రూ.2లక్షలు, తాడూర్ మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన వెంకటయ్య కుటుంబానికి రూ.2లక్షలు, తెల్కపల్లి మండలంలోని గొలగుండం గ్రామానికి చెందిన కడెం చిన్నయ్య కుటుంబానికి రూ.2లక్షలు, రాంకొండ గ్రామానికి చెందిన బిజ్జు చందు కుటుంబానికి రూ.2లక్షల చొప్పున మంజూరైన చెక్కులను మృతుల భార్యలకు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. పార్టీల మనుగడ పార్టీ కార్యకర్తల మీద ఆధారపడి ఉంటుందని, ఈ విషయం తెలిసిన సీఎం కేసీఆర్ పార్టీ కార్యకర్తలకు మిగతా ఏ పార్టీలకు లేని విధంగా సదుపాయం కల్పించారన్నారు. వారి ప్రీమియంను కూడా పార్టీ చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టపర్చడంలో కార్యకర్తల పాత్ర క్రియాశీలకమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా వర్తిస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## అభివృద్ధి పనులలో రాష్ట్ర ప్రభుత్వ వాటా సున్నా..

**- బీజేపీ నాయకులు బి.కృష్ణ, పెద్దిరాజు**

**వనపర్తి టౌన్, జూన్25, ప్రభాతవార్త:** తెలంగాణరాష్ట్రంలోని గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులలో రాష్ట్ర ప్రభుత్వ వాటా సున్నా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజులు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా, సుపరిపాలన పేదల సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారానికై మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం చిట్యాల గ్రామంలో 90పోలింగ్ బూత్ కుటుంబ సభ్యులను కలిసి కరపత్రాలు పంచుతు బీజేపీ సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో 12వేల గ్రామ పంచాయతీలలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి నరేంద్రమోడీ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ బిల్డింగ్‌ల నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి లైట్లకు ఎల్ఈడీ బల్బులు , హరితహారం, తడి పొడి చెత్త నిర్వహణకై, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి, వైకుంఠధామాలకు, రైతు వేదికల నిర్మాణానికి, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి , ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి, కరోనా సమయంలో ఉచిత వ్యాక్సినేషన్‌కు, కరోనా కారణంగా ప్రపంచంలోని చాలా దేశాల అధ్యక్షులు ఆర్థిక మాంద్యానికి రాజీనామాలు చేసి దేశాలు తలకిందులైన తరుణంలో మూడు సంవత్సరాలుగా దేశంలోని 80 కోట్ల ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తున్న విశ్వ నాయకుడు నరేంద్రమోడీ అని కేంద్రంలోను, రాష్ట్రంలోను ఒకే ప్రభుత్వం అధికారంలో ఉంటే తెలంగాణరాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని రాబోయే ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీకి మద్దతుగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇంచార్జ్ పెద్దిరాజు, మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కాటమడి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు మోడల వెంకటసాగర్, బూత్ కమిటీ అధ్యక్షులు జంగిడి యాదగిరి, రమేష్, బూత్ కమిటీ సభ్యులు పెద్దముక్కుల వెంకటేష్, బండ్ల మంద వెంకటేష్, వాకిటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరిస్తున్న బీజేపీ నాయకులు

## బిఆర్ఎస్‌ది అసమర్థ పాలన..

**పాలమూరు మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు అందుకు నిదర్శనం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 25 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ రద్దు నిర్ణయం బిఆర్ఎస్ అసమర్థ పాలనకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మహబూబ్‌నగర్ జిల్లా మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దుపై స్థానిక కాంగ్రెస్ నాయ కులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ కాలేజీ యజమాన్యం జిఎంఆర్ మాట్లా డుతూ కాలేజీ యాజమాన్యం కాలేజీలో కనీస వసతులు కల్పించాలని, పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ నియమించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన స్థానిక మంత్రి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కాలేజీ ఏర్పాటు సందర్భంగా ఆర్భాటపు ప్రచారం చేసుకున్న మంత్రి వసతులు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. మెడికల్ కాలేజీలో 400ల మంది ఫ్యాకల్టీ అవసరం ఉంటే ప్రస్తుతం 190 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారని, ఒకవైపు ఫ్యాకల్టీ కొరత, మరోవైపు కాలేజీలో సిసి కెమెరాలు పనిచేయకపోవడం, బయోమెట్రిక్ విధానా న్ని ఎస్ఎంసి పోర్టల్‌కు లింక్ చేయకపోవడం, ఫ్యాకల్టీకి సంబంధించిన వివరాలు ఆధార్ ఎనేబుల్డ్ బయో మెట్రిక్ సిస్టంలో పొందు పర్చకపోవడం తదితర కారణాలతో కాలేజీకి గుర్తింపు రద్దయిందని తెలిపారు. పరిష్కరించడం లేదా వైద్ అప్పీల్‌కు సమయం ఉన్నం దున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫ్యాకల్టీని నియమించి, కనీస వసతులు సమకూర్చి కాలేజీ గుర్తింపుకు కృషి చేయాలని జిఎంఆర్ ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో విద్యార్తుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, జిల్లా ప్రచార కార్యదర్శి బెనహర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిబాబా, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, ఐఎన్‌టియుసి టౌన్ అధ్యక్షులు షేక్‌బాబు, బాబన్న పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## స్వతంత్ర జర్నలిస్టు తులసిచందుపై మతోన్మాదుల బెదిరింపులను ఖండించండి

**- తులసి చందుకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి**

**- కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**వనపర్తి టౌన్, జూన్25, ప్రభాతవార్త:** స్వతంత్ర జర్నలిస్టు సామాజిక విశ్లేషకురాలు తులసి చందును ఫోన్‌లు చేసి చంపుతామని బెదిరిస్తున్న ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల ఆగడాలను ఖండిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్ బాబులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వతంత్ర జర్నలిస్టుగా మతోన్మాదం మనువాద ఆగడాలు అరాచకాలను ప్రశ్నిస్తు దేశంలో శాంతి మతసామరస్యాలను పెంపొందించాలనే దృఢ సంకల్పంతో అనేక సామాజిక మాధ్యమాలలో విశ్లేషణలు చేస్తున్న ఆమెపై బెదిరింపులకు పాల్పడడం ప్రజాస్వామిక హక్కును కాలరాయడమేనని అన్నారు. గతంలో ప్రశ్నించిన గౌరీ లంకేష్, కల్బుర్గి ఫన్సారే, ధబోల్కర్ లను హతమార్చిన ఈ మతోన్మాద గుండాలు ఇప్పుడు తులసిచందును హత్య చేస్తామంటూ బెదిరిస్తున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తులసిచందుకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బెదిరింపులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలు తులసిచందుకు సంఘీభావంగా నిలబడాలని కోరారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన వైస్ ఎంపిపి, ర్యాలంపాడు గ్రామస్తులు



**ధరూర్, జూన్ 25 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో ధరూర్ మండల వైస్ ఎంపి పి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలం పాడు గ్రామం నూ తన పునరావాస కేంద్రానికి సంబంధించిన షిఫ్టింగ్ ఛార్జ్ గ్రామ ప్రజల అకౌంట్లలో డబ్బులు జమ చేయడం కోసం కృషి చేసినందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కెసిఆర్, ఎమ్మెల్యేకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, గ్రామ ప్రజలు, బిఆర్ఎస్ పార్టీసీనియర్ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

**నవాబ్‌పేట, జూన్ 25 ప్రభాతవార్త :** నవాబ్‌పేట మండలం చౌడూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్ పార్టీముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార దాహంతో ప్రజలను విస్మరిస్తున్న టిఆర్ఎస్ పార్టీని గద్దె దించడం పార్టీ బలోపేతానికి సమిష్టి కృషితో ప్రజా సంక్షేమానికై పరితపించే కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు తీసుకోవడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం



**వెల్దండ, జూన్ 25 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణానికి తమ వంతు విరాళంగా బంజార అశ్విత రూ.25వేలను గ్రామ సర్పంచ్ అంజి నాయక్, లచ్చిరాంనాయక్‌లకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేవాలయాభివృద్ధి కొరకు దాతలు ముందుకొచ్చి సహకరించాలన్నారు. బంజార బిడ్డ దేవాలయాభివృద్ధికి విరాళం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, శ్రీనునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## టీడీపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అధ్యక్షుడిగా మెట్టుకాడి శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్25, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియో జకవర్గ అధ్యక్షుడిగా మెట్టుకాడి శ్రీనివాస్ ముదిరాజ్‌ను నియామకమయ్యారు. ఈమేరకు పార్లమెంట్ కమిటీని 23మంది సభ్యులతో ఏర్పాటు చేసినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో మెట్టుకాడి శ్రీనివాస్ ముదిరాజ్‌కు నియామకపత్రాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.



## నేనున్నానంటూ ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే ఆల..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఎమ్మెల్యే నేరుగా వెళ్లి కలిసారు. రైతుభీమా,పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులు మొత్తం 7లక్షల చెక్కులు నేరుగా కార్యకర్త ఇంటికి వెళ్లి కేశవులు భార్య ఉదగిరి భూదేవికి అందజేశారు.నిరుపేద కుటుంబం కావడం,ఇంటిపెద్దను కోల్పోవడంతో కేశవులు భార్యపిల్లలు ఇబ్బందులు పడవద్దని సిద్దాయిపల్లి వద్ద డబుల్ బెడ్‌రూమ్‌ను మంజూరు చేశారు.కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడంపై నియోజకవర్గ కార్యకర్తలు అందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి నాయకుడు తమకు ఎమ్మెల్యేగా ఉండడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ బస్వరాజ్‌గౌడ్,మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మన మోని సత్యనారాయణ పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆది ఆంజనేయస్వామి దేవాలయాన్ని కొత్త హంగులతో నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆంజేయస్వామి గుడినిర్మాణం కోసం అధిక నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. దేవాలయం పనులు నాణ్యతతో కూడి ఉండాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నారాయణపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త, ఎమ్మెల్యే సోదరుడు ఎస్. రవిందర్‌రెడ్డి, మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి.కృష్ణ, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భీంరెడ్డి, ఎంపిటిసిలు ఆంజనేయులుయాదవ్, వేముల జగన్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి రాజ్‌కుమార్, మండల బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు లక్ష్మి నారాయణగౌడ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాలకు ముహూర్తం ఖరారు..

### జులై 12న బోనాల వేడుకలు

**దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త :** దేరకద్రలో కొలువుదీరిన గ్రామ దేవత శ్రీ పోచమ్మ బోనాల ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. దేవరకద్రలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం సమావేశమైన గ్రామపెద్దలు పోచమ్మ బోనాల ఉత్సవాలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. ప్రతి ఏడాది పోచమ్మ బోనాల వేడుకలను పట్టణ ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. అందులో భాగంగానే జులై 2న గ్రామదేవత కట్టమైసమ్మ వేడుకలను నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే 7న తాయమ్మ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నారాయణపేట,జూన్ 25 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలోని 6 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి భూమి పూజ చేశారు. 10 లక్షలతో ఎస్సీ కమ్యూనిటి భవనానికి భూమిపూజ, దామరగిద్ద తండాలోని 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ, నర్సాపూర్ గ్రామంలోని 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ 50 లక్షల 40 వేలతో మన ఊరు మనబడి ప్రారంభం, ఫార్మేషన్ రోడ్డుకు శంకుస్థాపన, లోకుర్తి గ్రామంలో 20 లక్షలతో గ్రామ పంచాయతి భవనం, 20లక్షలతో పిహెచ్‌సి సబ్ సెంటర్, 6 లక్షతో బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ, మల్‌రెడ్డి గ్రామంలో 6 లక్షలతో బస్ షెల్టర్‌కు భూమిపూజ, గుడిమున్కన్‌పల్లి గ్రామంలో 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొన్నారు.



## పరిశుభ్రతకు నోచుకోని పశువుల దవాఖాన ప్రాంగణం..!

**- తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్న పట్టించుకొని ప్రజాప్రతినిధులు**

**జల్లాఘణపురం,,జూన్25,ప్రభాతవార్త:** శుభ్రత పరిశుభ్రతపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న కనిపించే బజారులు శుభ్రతపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలపై లేదనడానికి ఉదాహరణ ఘణపురం స్థానిక పశువుల దవాఖానలో చెత్తా చెదారంతో దర్శనం ఇస్తుంది ఈ దవాకాన దగ్గర్లో కూరగాయల మార్కెట్ , మాంసపు మార్కెట్ దగ్గర్లో బస్టాండ్ ఉన్నాయి. ప్రతి ఆదివారం జరిగే సంతకు స్థానిక ప్రజలు చుట్టు గ్రామాల వారు అధిక సంఖ్యలో వస్తారు. చెత్త బండిలో చెత్తను వేసినప్పటికీ పశువుల దవాఖాన ప్రాంగణంలో కొంత మంది సంతకు వచ్చే వ్యాపారులు చెత్త వేస్తున్నారు. అక్కడ చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నా ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. దవాఖాన దగ్గర్లో ఉన్న వ్యాపారస్థులకు చెత్త వల్ల పందులు, మురికి నీరు చేరుకుని వాటి నుండి వచ్చే దోమలు దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావునా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ పశువుల దవాఖాన ప్రాంగణం శుభ్రం చేసి ఇక నుండి ఈ ప్రభుత్వ స్థలంలో చెత్త వేయకూడదని బోర్డు పెట్టాలని సదరు వ్యాపారస్తులు గ్రామ ప్రజలను కోరుతున్నారు.







చెత్త కుప్పలుగా మారిన పశువుల దవాఖాన పరిసరాలు

# ఉన్నత లక్ష్యం పట్టుదలతో దేనినైనా సాధించవచ్చు..!

**దీప్తిచౌహాన్ సివల్స్ విజేత సాధించడం గర్వంగా ఉంది**
**దీప్తిచౌహాన్, సృజన ఆత్మీయ సన్మాన సభలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**
**నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**





ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపి రాములు


**లింగాల,జూన్ 25 ప్రభాతవార్త :** ఉన్నత లక్ష్యం, పట్టుదలతో ఉంటే ఏదైనా సాధించవచ్చని దీనికే నిదర్శం లింగాలకు చెందిన గిరిజన బిడ్డలు దీప్తి చౌహాన్, సృజననేని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు అన్నారు. సివిల్స్ విజేత దీప్తిచౌహాన్ ఆత్మీయ సన్మాన సభను మండల కేంద్రమైన లింగాలలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం పార్టీలకతీతంగా ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములు మాట్లాడుతూ దీప్తిచౌహాన్ వైద్య విద్యను పూర్తి చేసిన వెంటనే జాతీయ స్థాయిలో సివిల్స్ ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. అదే విధంగా కావేటి సృజన సివిల్ జడ్జిగా కావడం ఈ నల్లమల ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. విజయం సాధించాలంటే ఓటమికి కుంగిపోవద్దని సివిల్స్‌లో ర్యాంకు సాధించిన దీప్తి చౌహాన్ సృజనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పట్టుదలతో చదివి ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలన్న తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా అవసరం అన్నారు. మారుమూల ప్రాంతం నుంచి బంజరా జాతికి చెందిన మహిళ కలెక్టర్‌గా కావడం ఈ ప్రాంత ప్రజలకు, తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణమన్నారు. మండల కేంద్రంలోని బంజారా భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు అదేవిధంగా మేరమ్మ భవాని ఆలయం చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సివిల్స్ విజేత దీప్తిచౌహాన్, సృజనను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎంపి పోతుగంటి రాములుతో పాటు పలువురు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపిపి లింగమ్మ, సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, నాగర్‌కర్నూల్,వనపర్తి జిల్లా వైద్యాధికారులు సుధాకర్‌లాల్, అల్లె శ్రీనివాసులు, డా. యశోద, పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు బిక్క్యనాయక్, సింగిల్ విండో ఛైర్మన్ హనుమంత్‌రెడ్డి, మద్దిమడుగు పీఠాధిపతి గురుస్వామి జయరాం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రవిశంకర్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సుధీర్‌గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కెటి తిరుపతయ్య, బంజారా నాయకులు చందునాయక్, హనుమంతునాయక్, మోతిలాల్, శంకర్‌నాయక్, బాలాజీ, శివపవన్, రాజ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# ధరణి ఎత్తేస్తాం..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మోడీ ఈజిప్టుకు వెళ్తే అక్కడ కూడా ఘనస్వాగతం పలికారని భారతీయుడిగా గర్వపడుతున్నామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యంత సుందరంగా రూ.740 కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. తెలంగాణకు రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇచ్చారని, 2500 కిలోమీటర్ల నేషనల్ హైవే, హైదరాబాద్ - నల్గొండ ఇండస్ట్రీయల్ కారిడార్, హైదరాబాద్ -వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్, మెగా టెక్స్‌టైల్ పార్క్, తెలంగాణలో రూ.1010 కోట్ల రైల్వే లైన్, రామప్పకు యూనెస్కో గుర్తింపు ఇవన్నీ మోడీ వల్లే సాధ్యమయ్యాయన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని, అవినీతి పాలన పోవాలంటే, రైతుల ఆత్మహత్యలు పోవాలంటే, యువకులు బాగుపడాలంటే కమలం వికసించాలని పిలుపునిచ్చారు. అంతకముందు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ తొమ్మిదేండ్ల పాలన కేంద్రంలో ఎలా ఉంది..రాష్ట్రంలో ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశం కీర్తిని పెంచేలా ప్రపంచ పంటంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెస్తుంటే , రాష్ట్రంలో మాత్రం పాలన అవినీతిలో కూరుకుపోయిందన్నారు. తెలంగాణ ఎందుకు తెచ్చుకున్నామో ఆ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్నారు. అభివృద్ధి కేవలం కల్వకుంట్ల కుటుంబంలోనే ఉందన్నారు. దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్ పోలీసులను పక్కన పెట్టి తమ వెంట రావాలని చాలెంజ్ విసిరారు. ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూయించాలని, ఎక్కడ డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారో లెక్క చెప్పాలన్నారు. పేరుకే పాలమూరు - రంగారెడ్డి ఉందని, ఇప్పటి వరకు నీళ్లు ఇవ్వలేదన్నారు. వట్టెంలో భూమిపూజ చేసినప్పుడు కేసీఆర్ ఏం చెప్పాడో ప్రజలు ఒకసారి గుర్తుకుతెచ్చుకోవాలన్నారు. వచ్చే మూడేండ్లలో ప్రాజెక్టు పూర్తి కృష్ణా జలాలతో కందనూలు ప్రజల కాళ్లు కడుగుతానని అన్న మాట వాస్తవం కాదా అని, మరి నీళ్లు ఏమాయాయ్యని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లయినా ప్రాజెక్టు పూర్తి కాలేదనని, ప్రజలను కొత్త కొత్త మాటలు చెప్పి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ప్రాజెక్టుకు కోర్టులో కేసులు వేశారని చెప్పిన వారు ఇప్పుడు నీ వెనకే ఉన్నారు కదా కదా ఎందుకు కొట్లాడి ప్రాజెక్టు పూర్తి చేయవని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి లక్షల మంది విద్యార్థుల కడపుకొట్టారని, దాని వెనకాల కల్వకుంట్ల కుటుంబమే ఉందన్నారు. రైతులకు సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేలు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని, మోడీ ఎరువుల సబ్సిడీ కింద రూ.25వేలు అందిస్తున్నారన్నారు. కర్ణాటకలో ఒక్కటి గెలిస్తే అంతా అయిపోయినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని దేశం మొత్తం మోడీ హవా ఉందన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో జైలుజీవితం గడిపిన గొప్ప దేశాభిమాని నడ్డా అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే రాజకాయంగా సేవ చేస్తున్నారని, కమల వికాసానికి ఎంతో కృషి చేస్తున్న గొప్ప నాయకుడు పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మహేంద్రనాథ్‌పాండే, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిసన్ సభ్యుడు ఆచారి, మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, నాయకులు బంగారు శృతి , పార్టీ వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.




దేవరకద్రలో ఆదివారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది.రుతుపవనాల రాకతో వర్షాలు రావడం ప్రారంభం కావడంతో ఆకాశంలో నల్లని మోఘాలు కమ్ముకొన్నాయి.కాసేపు ఆకాశం ఈ విదంగా అలరించింది. వర్షాల రాక కోసం ఎదురుచూస్తున్న తరుణంలో వర్షం కురువడంతో రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.అందుకే మేఘమా..మమ్మల్ని మరువకే అని అంటున్నారు. – దేవరకద్ర,జూన్ 25 ప్రభాతవార్త

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట..!

**రూ.45లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ**

**ఇటిక్యాల,జూన్ 25 ప్రభాతవార్త :** గ్రామాలలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు సిసి రోడ్లను ప్రభుత్వం చేపడుతుందని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు.ఆదివారం మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ పంచాయతీలో 20 లక్షలు, కోదండపురం గ్రామ పంచాయతీలో 10 లక్షలు, బీచుపల్లి, యక్తాపురం,కొండపేట గ్రామాలలో 15 లక్షల రూపాయలతో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణాలకు అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అదేవిధంగా ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక రకాల సంక్షేమ పథకాలు అన్ని వర్గాల వారికి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని అలాగే గ్రామాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిడ్డారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు నరసమ్మ, రవి, సుంకన్న, జయచంద్రారెడ్డి, రాముడు, మధునాయుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలి శ్రీనివాసులు, లోకారెడ్డి, శివుడు సుంకన్న, యుగంధర్‌రెడ్డి, రాగన్న, పెద్దలక్ష్మన్న, కృష్ణసాగర్,తిమ్మారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సన్మానించిన స్థానిక నాయకులు

## గుడి నిర్మాణానికి 50 వేల విరాళం..



**కోయిల్‌కొండ,జూన్ 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొత్లాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ, శివాలయం గుడికి గ్రామానికి చెందిన మల్యాల మంగమ్మ న్యాయవాది వ్యవసాయ పొలానికి వస్తున్న మొత్తము రైతుబంధు రెండు లక్షల 3 వేలు గుడి నిర్మాణానికి ఆదివారం విరాళంగా ఇవ్వడం జరిగింది. దీంటో భాగంగా మొదటి విడతలో 50 వేల చెక్కును గుడి నిర్మాణానికి విరాళంగా ఇవ్వడంతో గ్రామస్తులు మాల్యాల మంగమ్మ, అడ్వకేట్ కుటుంబ సభ్యులను అభినందించారు. ఇలాంటి దాతలు మరెవరైనా ఉంటే గుడి నిర్మాణం కోసం ముందుకు రావాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి..

**మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వెంకటయ్య**



**కోయిల్‌కొండ,జూన్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ ముదిరాజుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిఆదివారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని స్వామి వివేకానంద చౌరస్తా ప్రాతంలో మండల ముదిరాజన సంఘం నేతలు భారీగా తరలివచ్చి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ప్రదమైన స్థానంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఉంటూ ఆయన ప్రవర్తించిన తీరు సమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాడి కౌశిక్‌రెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ముదిరాజ్ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల ముదిరాజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేటి పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

**గద్వాల ప్రతినిధి,జూన్ 25 ప్రభాతవార్త :** అచల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి ఆధ్వర్యంలో గద్వాల జిల్లాలో నిర్వహించిన సమావేశంలో ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికొదిలేసిన దుస్థితి రాష్ట్రంలో కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించి పర్మినెంట్ విద్యాశాఖ అధికారులను నియమించి కార్పోరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు. డీఈఓ, ఎంఈఓ రిక్రూట్‌మెంట్ విడుదల చేసి వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న నిబంధనలకు విరుద్దంగా అధిక రేట్లకు పుస్తకాలను అమ్ముతున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో మూసేసిన 8624 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించి ప్రభుత్వ విద్యను పటిష్టపరచాలన్నారు.




## ప్రతి ఎకరానికి రైతులకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యం..!

**పేస్1 నుండి సాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి**

**ధరూర్,జూన్ 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుడ్డందొడ్డి గ్రామ సమీపంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ఫేస్ 1 నుండి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంప్ హౌస్‌ను స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. సీఎం కెసిఆర్ ఫోన్ చేసి ఎమ్మెల్యే నీటి విడుదల చేయాలని సూచించడం జరిగింది. అనంతరం గంగమ్మ పూజ చేసి నీటిని ప్రారంభించారు. రిజర్వాయర్ నీటిని విడుదల రైతులకు, కాలువలు, చెరువులు, కుంటలు, నీటిని నింపడానికి రైతులకు వ్యవసాయానికి నీళ్లు ఉపయోగించడానికి సాగునీటిని విడుదల చేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో రైతులకు వ్యవసాయానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ సాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నజీమున్నిసాబేగం, జడ్పీటిసి పద్మా వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే



సాగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే